

# మంటలు మంటలు

చంద్రమౌళి

'డియర్ శశికాంత్,

ఎంతో బాధతో, వేదనతో ఈ ఉత్తరం రాస్తున్నాను నేను! ఇందులో రాస్తున్న విషయాలు నీకు కొత్తవి కావు. అయినా ఇవి మన జీవితంతో పెనవేసుకుని రెండు సంవత్సరాల మనవైవాహిక జీవితంలో మైలురాళ్ళుగా నిలిచి ఉండటం వల్ల మళ్ళీ మళ్ళీ గుండెలను కోస్తూ, గత స్మృతులను తిరగతోడుతూ నిత్యం ప్రశాంతంగా గడప వలసిన మన వైవాహిక జీవితంలో దుమారాలు రేపుతున్నయ్. స్త్రీ సహజమైన సహనంతో నే నింత కాలం ఈ విషయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వలేదు! అయినా ప్రేమతో తర్కంతో నీలో మార్పు తేవాలని ఎంత ప్రయత్నం చేశానో నాకే తెలుసు. ఈ విషయాలు మన మధ్య చర్చకు వచ్చినప్పుడల్లా నువు వాటిని అతి అల్పమైన విషయాలుగా తీసి వేయటం నాకు తెలుసు.

మన పెళ్ళికి ముందు రోజులు నీకు జ్ఞాపకముండి ఉంటాయి. ఆ రోజుల్లో నీ కోసం కాలెజి ఎగగొట్టి బస్ స్టాపుల దగ్గర ఎలా పడిగాపులు కాచానో నీకు తెలుసు. ఫైనలియర్ పరీక్షలు రెండు రోజు లున్నాయనగా పిక్చరుకు రమ్మని నువు బలవంత పెడితే ఇంట్లో వాళ్ళని మభ్య పెట్టి నీతో పిక్చరు రావటం నిన్నూ నన్నూ పిక్చరులో చూచి మా పక్కింటితను మా నాన్నకు చెప్పటం ఆ తరవాతి డ్రామా నే నిప్పుడు రాయబోవటం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ రోజుల్లో నువు సముద్రంలో దూకమంటే దూకేదాన్నేమో! మన వివాహానికి మా వాళ్ళొప్పు కోకపోవటం మన మిద్దరం రహస్యంగా రిజిష్టరు మారేజి చేసుకోవటం, అప్పటికీ నేను ఎం. బి. బి. ఎస్. పాస్ కావటం నీకు ఉద్యోగం లేకపోవటం మన పొట్ట కూటి కోసం నేను ప్రాక్టీసు పెట్టటం నీకు జ్ఞాపకం చేయవలసిన అవసరం లేదు.

నన్నెంత ప్రేమగా చూచే వాడివి, నే నెక్కడ బాధ పడతానో అని అన్ని విషయాలు ఎంత శ్రద్ధగా కనుక్కునే వాడివి, పేషంట్ల రద్దీ వల్ల నే నింటికి రావటం ఆలస్యమయితే నువు చేతులు కాల్చుకుని నా కోసం ఎంత ఆత్రతతో చూస్తూ ఉండే వాడివి. నిన్ను చూస్తే నాకు జాలి వేసేది. నీకు ఉద్యోగం లేదని నువు బాధ పడుతూంటే నిన్ను ఎలా వోదార్చాలో తెలీక ఎంత మధన పడేదానిని.

ఎంతో ప్రయత్నం చేశాక నీకు లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. అయినా నన్ను విడిచి పెట్టి వెళ్ళాల్సొస్తుందని, అది రిజక్ట్ చేశావ్. ఇంతలో నాకు గవర్నమెంటు హాస్పిటల్‌లో ఉద్యోగం వచ్చింది. మన పరిస్థితి కొంత మెరుగైంది, మంచి జీతం. వర్రీ లేని జీవితం. అయినా ఒక్క క్షణం విశ్రాంతి ఉండేది కాదు. వేళా పాళా లేని డ్యూటీలో నువ్వు ఎప్పుడూ విసుక్కునే వాడివి కాదు. నీకు సినిమాలు చూడాలని ఉండదు. అయినా నా కోసం సినిమాకు వచ్చేవాడివి.

రోజులు ఇట్టే మారిపోయినై. నీకూ ఉద్యోగం వచ్చింది. ఇక మనం జీవితంలో రాకూడని మలుపు వచ్చింది. ఇంత కాలం నువ్వు నా మీద చూపించిన ప్రేమ వాత్సల్య మనుకున్నాను కాని నీ అవసరాలు గడుపుకోవటానికి నువ్వు వేసిన నాటకం అని నేను కనుక్కోలేకపోయాను. నీకు ఉద్యోగం రావటంతో నీకు రెక్కలు వచ్చినట్లయింది. అంతమటుకు పైకి తొంగి చూడని పురుష సహజమైన పొగరు నీలో పుంజుకున్నది. నీలో పూర్తిగా మార్పొచ్చింది. ఆదివరకు సిగరెటు కంపుకూడా భరించలేని నువ్వు చెయిన్ స్మోకర్ వైనావు. సిగరెట్టు తాగటంలో ఉన్న నష్టాలు నీకు తెలీనివి కాకపోయినా చెవి నిల్లు గట్టుకుని చెప్పాను. అయినా నువు నా మాట లక్ష్యం చేయలేదు. కూల్ డ్రింక్ తాగటానికే వెనకాడే వాడివి రోజూ తాగి ఇంటికి రావటం మొదలెట్టావు. నేను ఎంత లాలనగా చెప్పినా నీలో ఏ మార్పూ రాలేదు. పైగా ఇంటి దగ్గరే తాగటం మొదలెట్టావు. ఎంత మొత్తుకున్నా పెడచెవిని పెట్టావే కాని ఫలితం మాత్రం శూన్యం. ఆవారా జుట్టు పెంచుకుని పొడుగాటి గోళ్ళు పెంచుకున్నావు ఇంటికి రావటం లేటయిరావటమే కాకుండా సెలవు రోజుల్లోకూడా ఇంటిపట్టున ఉండటం మానివేశావు.

'నువ్వేమీ చిన్న కుర్రాడివి కాదు. చదువు సంస్కారం కలవాడివి. అలా అన్నానని నేను నీ మీద పెత్తనం చెలాయించాలని చూస్తున్నానన్నావ్! నీ ఇష్టమొచ్చినటు నిన్ను బతుక నీయమన్నావు. ఇంతటి మూర్ఖత్వం నీలో కరుడు కట్టుకు పోయినా క నీతో కలిసి జీవించటం నా తరం కాని విషయం. నీకు ఏది మంచో చెడో నిర్ణయించుకునే హక్కు నీకున్నట్టే నాకు ఏది మంచో చెడో నిర్ణయించుకునే హక్కు నాకూ ఉంటుంది కదా! అందుకనే ఎంతో ఆలోచించి ఈ నిర్ణయాని కొచ్చాను. నీకూ నాకూ పొసగదు. నువ్వుఉత్తర ధృవానివి. నేనుదక్షిణ ధృవాన్ని మనిద్దరం ఒకప్పుడు ప్రాణ సమానంగా ప్రేమించుకున్న యువతీ యువకుల మంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. నువ్వప్పుడు నా మీద చూపిన ప్రేమంతా నాటకమో బూటకమో అనే నిర్ణయానికి వచ్చాను. అందువల్ల ఇక నీతో సంసారం చేయుటం నా తరం కాదు. నీ బూటకాల కొక నమస్కారం! చట్టరీత్యా మనం విడిపడటానికి కొంత కాలం పట్టవచ్చు! అంత వరకూ నేను హాస్పిటల్ హాస్టల్లోకి మారుతున్నాను.

నన్ను కలవటానికి ఏ విధమైన ప్రయత్నం చేసి దానివల్ల కలిగే పరిణామాలకు పూర్తి బాధ్యత నీదే
—అనురాధ."

"డియర్ ఊర్మిళా!

నా హృదయాంతరాళాలు తెగిపోతున్నై! గతాన్ని తలుచుకుంటే బతుకులోని మాధుర్యం గుర్తు కొస్తున్నది. భవిష్యత్తు తలుచుకుంటే జీవితంలో ఒక్కసారి చేసిన ఆ తప్పు మనల్ని పిశాచంలా ఎలా వెంటాడుతుందో తెలుస్తుంది!

మొదటినుంచీ నన్ను ఆకర్షించింది నీ తెలివి తేటలూ, కొంతవరకు నీ అందం! నీతో పరిచయం ఏర్పడ్డాక నీ సాన్నిహిత్యం నాకు లభించాక నిన్ను నా దాన్ని చేసుకోవాలనీ, నీ ప్రేమలో మునిగి పోవాలనీ ఎంతగా అనుకున్నాను! దానికితగ్గట్టు నీ ప్రోత్సాహం నీ ప్రేమా నన్ను పిచ్చివాడిని చేసి వేశాయి. ఆ మత్తులో గులాబి పూల వెనకే ముళ్ళుంటాయన్న విషయం పూర్తిగా మరిచి పోయాను! స్వతహాగా మంచిని తప్ప చెడును వూహించలేని నేను పూర్తిగా ఓడిపోయాను చిత్తుగా ఓడిపోయాను.

ఆ రోజులు నీకు బహుశా గుర్తుండే ఉంటయ్! ఆ రోజుల్లో నేను ఉద్యోగం లేక ఉద్యోగప్రయత్నంలో వూరూ వాడా తిరుగుతున్నరోజులు. ఆ రోజుల్లోనే నీతో పరిచయం కలిగింది. అదీ ఒక ఆదివారం బస్ స్టాప్‌లో. ఆ రోజు నాకు బాగా గుర్తు. నా జీవితంలో మరిచిపోవటానికి వీలులేని మైలు రాళ్ళలో అదొకటి. ఆ తరువాత నా జీవితం ఎంత తియ్యగా మధురంగా గడిచింది. నువ్వు చదువుకున్న దానివి సంస్కారం కలదానివని ఎంత మురిసిపోయాను. అయినవాళ్ళని అందరినీ వదులుకుని ఇద్దరమూ వివాహం చేసుకోవటానికి నిశ్చయించుకున్నప్పుడు, ప్రేమ సమాజాన్నే జయించిన భావం నాకు కలిగింది! నీ కోసం నేను, నా కోసం నువ్వూ జన్మించినట్లు తరతరాలుగా మనం భార్యా భర్తలంగా తోచింది. ఆ తియ్యటి రోజు రిజిస్ట్రారు దగ్గర సంతకం చేస్తున్న సమయం నా కళ్ళ ముందు ఇంకా మెదులుతూనే ఉంది. ఆ తరవాత మనం తీయించు కున్న ఫోటోలో ఎంతో స్నిగ్ధంగా అమాయకంగా అప్పుడే వికసించిన పుష్పంలా ఉన్నావు నువ్వు. నా వాళ్ళందరినీ కాదని, లక్ష రూపాయల కట్నంతో వచ్చే పిల్లను కాదని, నిన్ను ప్రేమించిన నేరానికి నిన్ను పెళ్ళి చేసుకున్నాను నేను.

మన జీవితం కొంత కాలం సాఫీగానే గడిచింది ఆ ముచ్చట ఎన్నాళ్ళో ఉండలేదు. నీ సంపాదన మీద ఆధారపడి నా బతుకు నీ ఇంటి నౌకరిలా అయింది. 'హాస్పిటల్ డ్యూటీ అంటూ వేళా పాళా లేని సమయంలో నువ్వు ఇంటికివచ్చేదానివి. నౌకరును పెట్టుకుందామంటే నీ సంపాదన చాలదని అడ్డు చెప్పేవు నీకు జ్ఞాపకముందీ' ఫలితం నేనే ఇంటి పని మొత్తం సర్దుకోవలసి వచ్చింది. మా ఇంట్లో ఎప్పుడూ ఏ పని చేసి ఎరగని నాకు, ఈ మార్పు గొప్ప అవమానంలాగా తగిలింది. అయినా నీ కోసం నీ ప్రేమ కోసం నేను సరిపెట్టుకున్నాను.



ఫొటో — ఎస్. శివశంకరయ్య

నాకు లెక్చరర్ ఉద్యోగం వచ్చిన రోజు జరిగిన సంఘటన నీకు గుర్తుండే ఉంటుంది. ఉద్యోగం పురుషలక్షణమని ఎంత చెప్పినా వినలేదు. నన్ను విడిచి ఉండలేనని కుంటినాటకం ఆడి చేతి కందిన ఉద్యోగం వదులుకునేటట్లు చేశావు! లేకపోతే ఇంటిపనులు నువ్వు చేసుకోవలసొస్తుందనేగా. పైగా అప్పుడప్పుడు నేను మెతకమనిషినని. మా నాన్నతో పోట్లాడి నా వాటా ఆస్తి తెచ్చుకోమని వాదులాడేదానివి గుర్తుందా? వాళ్ళతో బంధాలు తెంచేసుకు వచ్చాక ఆయన ఆస్తికి ఆశపడటం నీచమని అన్నానని రెండు రోజులు నాతో మాట్లాడటం మానివేశావు జ్ఞాపకముందా?

అదృష్టంకొద్దీ నాకూ ఉద్యోగం వచ్చింది. జీతం నీకన్న తక్కువైనా మామూలుగా నా క్వాలిఫికేషన్‌కు దొరికే జీతంకన్న ఎక్కువే! అయినా నువ్వు నాకన్న ఎక్కువ జీతం తెచ్చుకుంటున్నావని ఈర్ష్యపడలేదు నే నెప్పుడూ! మనిద్దరి మధ్య ఉన్న అనుబంధానికి మన సంపాదనా శక్తికి సంబంధం ఉందని నే నెప్పుడూ వూహించనన్నా వూహించలేదు!

అయితే నీ ఆలోచనలు వేరుగా ఉన్నాయని తరువాత గాని తెలుసుకోలేకపోయాను. నీ స్నేహితురాళ్ళయిన లేడీ డాక్టర్లు వచ్చినప్పుడు ఇంట్లో ఉన్నా నన్ను పరిచయం చేసేదానివి కాదు! నా ఫ్రెండ్స్ నా ఆఫీసులో పనిచేసే వాళ్ళు వస్తే, వాళ్ళని నీకు పరిచయం చేద్దామంటే నీ రూము లోకి వెళ్ళి తలుపేసుకునేదానివి. వాళ్ళు కూర్చుని కూర్చుని వెళ్ళిపోయాకే బయటకు వచ్చేదానివి! అదేమిటని తరువాత నే నడిగితే తలనొప్పిగా ఉంటే పడుకున్నాననేదానివి. మొదట్లో నువ్వు చెప్పింది నమ్మినా రాను రాను నువ్వు చెప్పేదాంట్లో నిజం పాలు చాలా తక్కువని తెలుసుకున్నాను. మనం భార్యా భర్తలం మనిద్దరి మధ్య దాపరికాలేమిటన్న నువ్వే, నీ మనస్సులో ఉన్నదేదీ నాకు చెప్పలేదనే ఆలోచన నాకు కలుగసాగింది. బహుశా నీలాటి లేడీ డాక్టర్లమాదిరి, డాక్టర్నే పెళ్ళి చేసుకుని ఉండవలసిందని భావిస్తుండాలి. నేను కూర్చుంటే తప్పు పట్టేదానివి. నుల్చుంటే తప్పు పట్టేదానివి. గళ్ళ నైట్ సూట్ వేసుకుంటే హాస్పిటల్‌లో పేషంటులాగా ఉన్నావనే దానివి. నేనేది చేసినా నీకు నచ్చేదికాదు. నాకు మ్యూజిక్ అంటే చాలా ఇష్టం. నా ఫ్రెండొకతను ఫారిన్ వెళుతుంటే ఏదైనా తెచ్చిపెట్టమన్నాను. అతను టు—ఇన్—వన్—తెస్తే ఎంత గొడవ చేశావు. డబ్బంతా వేస్టు చేస్తున్నావ్! భార్యగా నీతో సంప్రదించకుండా నీ ఇష్టం వచ్చినట్లు చేస్తున్నావ్ అసలు అతను తెస్తాడని నాకే తెలిదంటే— ఇదంతా అబద్ధం అని దబాయించావు.

ఒకవిధంగా చెప్పాలంటే నా జీవితాన్ని నరక ప్రాయంగా చేశావు. ఈ విషయం నీకు అర్థమయ్యేలా చెప్పటానికి ఎన్నోసార్లు ప్రయత్నం చేశాను. అయినా నువ్వు నీకు సహజమైన అసహనంతో నన్ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయలేదు. రాను రాను నువ్వుండగా నేను ఇంట్లో ఉండలేని పరిస్థితిని కల్పించావు. నే నా మెంటల్ టార్చర్ భరించలేకపోయాను. అందుకనే సిగరెట్లు తాగటం అలవాటు చేసుకున్నాను. వాటివల్లా మనశ్శాంతి లభించక 'డ్రింక్స్' తాగటం అలవాటు చేసుకున్నాను. నీనుంచి నన్ను కాపాడే షీల్డ్సుగా వాటిని నేను ఉపయోగించుకున్నాను. నాచేత వాటిని మానిపించాలని ప్రయత్నించావే గాని నేను ఎంత చెప్పినా నా బాధను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించ లేదు నువ్వు. ఆఖరికి నీతో చెప్పకుండా తెప్పించానని నేను టు—ఇన్—వన్ పెట్టినప్పుడల్లా నిన్ను నేను హత్యచేయబోయానన్నట్లుగా గొడవచేసేదానివి. ఆఖరికి నా గోళ్ళను గురించి కూడా నీకేవచ్చేది. ప్రేమ అనేది ఎలా టువే ట్రాఫిక్కో, బహుశ ద్వేషం కూడా అలాటిదేనేమో! నీ ద్వేషానికి లోనైన నేను క్రమ క్రమంగా నీ మీద ద్వేషం పెంచుకోసాగాను! నిన్ను చూడాలంటే అసహ్యం! నీతో మాట్లాడాలంటే అసహ్యం! మనం భార్యా భర్తలుగా జీవించటం మానివేసి అప్పుడే ఆరు నెలలయింది. ఇక ఇలా ఎంతోకాలం సాగించటం నా కిష్టంలేదు. నీ మాటలవల్లా, నీ చేతలవల్లా నా మనసు పూర్తిగా వాడిపోయింది! నేను ఓడిపోయాను. మనశ్శాంతి లేకపోవటంవల్ల నా జీవితమే దుర్భరమైపోయింది. ఒకప్పుడు ప్రేమ వివాహం చేసుకున్నానని ఎంత గర్వంగా చెప్పేవాడిని! ఇప్పుడు ఆ గర్వం లేదు, ఒకప్పుడు ఉద్యోగం వస్తే చాలని ఎంత ఆత్రపడ్డాను. ఇప్పుడు ఆ ఉద్యోగం మీద మనసు నిలవలేదు. ఇక నా జీవితంలో ఏవిధమైన మలుపు వచ్చినా దానికి పూర్తి బాధ్యత నీదే.

శ్రీకాంత్."